సాక్షి నల్లగొండ
బుధవారం ◊ 22 ◊ నవంబర్ ◊ 2023



ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు
ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు హుజూర్‌నగర్‌లో మూడు రోజులుగా దాడులు నిర్వహిస్తున్నారు. - 12లో



బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు
బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీ వర్గాలకు చేసిందేమీ లేదని జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్ అన్నారు. - 12లో



సకల జనులకు అండ
బీజేపీ జెండా.. సకల జనులకు అండగా నిలుస్తుందని కేంద్ర సహాయ మంత్రి శోభకరంద్లాజే అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ ఓటేసిన 2,053 మంది
నల్లగొండ: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. జిల్లాలో 2,373 మంది ఓటర్లు ఉండగా రెండు రోజుల నుంచి 2,053 మంది దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు ఇంటివద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది మొత్తం1,098 మంది పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఓటేశారు.

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక
రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎస్.సాగర్, బి.ప్రభాకర్, ఎస్.లోకేష్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని ఆ కళాశాల పీడీ కదారి మల్లేష్ తెలిపారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న ఇంటర్ కళాశాలల ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో విన్నర్‌గా నిలిచిన కళాశాల జట్టుకు చెందిన వీరు అత్యుత్తమ ఆటతీరు కనబర్చినందుకు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటాలి



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈఓ భిక్షపతి, ఉపాధ్యాయులు

నల్లగొండ: రోల్ ప్లే అండ్ ఫోక్ డాన్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులు వచ్చేనెల ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లాకు మంచిపేరు తేవాలని డీఈఓ భిక్షపతిఆకాంక్షించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రోల్ ప్లే అండ్ ఫోక్ డాన్స్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన జిల్లా కేంద్రంలోని పానగల్‌కు చెందిన విద్యార్థులను మంగళవారం నల్లగొండలోని తన కార్యాలయంలో డీఈఓ అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, రామనర్సయ్య, శోభారాణి, నల్లగొండ పాఠశాల హెచ్‌ఎం ప్రవీణకుమారిలను కూడా అభినందనలు తెలిపారు.

నేడు సూర్యాపేటకు మాయావతి రాక
సూర్యాపేట: బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి బుధవారం సూర్యాపేటకు రానున్నారు. స్థానిక జనగామ రోడ్డులోని పెద్దమ్మ తల్లి గుడి సమీపంలో బీఎస్పీ ఏర్పాటు చేయనున్న ఎన్నికల బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొని ప్రసంగించనున్నారు.

మట్టపల్లిలో భక్తులకు స్నానఘట్టాలు సిద్ధం
మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కృష్ణానదిలో భక్తుల కోసం స్నానఘట్టాలు సిద్ధం చేసినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కృష్ణానదిలో ఏటా కార్తీక మాసంలో పుణ్యస్నానాలకు పులిచింతల బ్యాక్ వాటర్ వల్ల ఇబ్బందులు ఉండేవన్నారు. అయితే ఈఏడాది పులిచింతల ప్రాజెక్టులో పూర్తి నిల్వ 43టీఎంసీలకు గాను కేవలం 13టీఎంసీలకు తగ్గడంతో మట్టపల్లి ఆలయం వద్ద స్నానఘట్టాలు తేలి ఉన్నాయని చెప్పారు. దీంతో నిత్యం వచ్చే రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు ఇక నుంచి నేరుగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసేందుకు వీలుకలిగిందన్నారు. ఈ సమావేశంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

మత్స్యగిరిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెంకటాపురంలో గల మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు అంకురార్పణ చేయనున్నారు. 27వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా 25న స్వామి, అమ్మవారి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మరింత అభివృద్ధి, సంక్షేమం అమలు కావాలంటే..
బీఆర్‌ఎస్ గెలవాలి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇంతటి అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా..
- రూ.30 వేల కోట్ల విద్యుత్ ప్రాజెక్టు తీసుకొచ్చాం
- కాంగ్రెస్ హయాంలో మూసీ మురికినీరు, ఫ్లోరిన్ నీరే గతి
- మేము మిషన్ భగీరథతో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం
- హరితహారం, పల్లెప్రకృతి వనాలతో గ్రామాల రూపురేఖలు మార్చాం
- సూర్యాపేట ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



సూర్యాపేట ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక తదితరులు

సూర్యాపేట : దశాబ్దాల కాలం సూర్యాపేట ప్రజలకు హైదరాబాద్ మూసీ నీరు తాగించిన దౌర్భాగ్యపు పార్టీ కాంగ్రెస్ అని, మునుగోడు దేవరకొండలో ఫ్లోరిన్ నీటితో లక్షా 50 వేల మంది ప్రజల ఉసురు పోసుకుంది కాంగ్రెస్ అని సీఎం కేసీఆర్ విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్ మరమ్మతులు చేయకుండా నాశనం చేసిన ఘనులు కాంగ్రెస్ నాయకులన్నారు. తాము మూసీ గేట్ల మరమ్మతు చేయించి రైతులకు సాగు నీరు అందించగలిగామని చెప్పారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి నల్లగొండ జిల్లాలో గతంలో ఏ మంత్రి అయినా చేసిండా? అని ప్రశ్నించారు. పట్టుబట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.30 వేల కోట్ల విద్యుత్ ప్రాజెక్టు తీసుకొచ్చారని, దీంతో వేలాది మందికి ఉపాధి లభించనుందన్నారు. గ్రామాలలో హరితహారం, పల్లె ప్రకృతి వనాలతో సస్యశ్యామలంగా మార్చుకున్నామని, చెత్త సేకరణకు ట్రాక్టర్లను అందించామని తెలిపారు. సీసీరోడ్ల నిర్మాణంతో పల్లె రూపురేఖలు మారాయని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో సద్దల చెరువు, పుల్లారెడ్డి చెరువులపై మినీట్యాంక్ బండ్‌లు ఏర్పాటు చేశామని, సమీకృత మార్కెట్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. దరిద్రపు కాంగ్రెస్‌ను కాలువలో తొక్కాలని, సూర్యాపేట మరింత అభివృద్ధి జరగాలంటే జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జగదీశ్‌రెడ్డిని గెలిపిస్తే మరోసారి ఉన్నత స్థానంలోనే ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, మధుసూదనాచారి, నాయకులు చెరుకు సుధాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, శంకరమ్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, ఒంటెద్దు నరసింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో గోరటి వెంకన్న ఆటాపాట

సూర్యాపేటను కోనసీమగా మార్చిన ఘనత కేసీఆర్‌దే : జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

కరువు నేల అయిన సూర్యాపేటను కాళేశ్వరం జలాలతో కోనసీమగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, గోదావరి జలాలను అందించి బీడుభూములను సస్యశ్యామలం చేశారని సూర్యాపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సభల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని చెప్పారు. సూర్యాపేటను జిల్లా చేశారని, మెడికల్ కళాశాల ఇచ్చారని వివరించారు. మూసీ మురికినీళ్ల నుంచి విముక్తి కల్పించి మిషన్ భగీరథ నీళ్లిచ్చారని చెప్పారు. రూ.7,500 కోట్లతో 9 ఏళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించి ప్రోత్సహించారని తెలిపారు.

డ్రైపోర్టు, ఇండస్ట్రియల్ పార్క్ ఇవ్వాలని వినతి
ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ - విజయవాడ మధ్యలో ఉన్న సూర్యాపేటలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో ఐటీ హబ్ ఏర్పాటు చేసినందున ఐటీ టవర్ల నిర్మాణం చేపట్టి విస్తరించాలన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఉండ్రుగొండ, పిల్లలమర్రి, ఫణిగిరి, మూసీలను కలుపుతూ టూరిస్ట్ సర్కిల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

దండిగా కదిలొచ్చిన జనం
సూర్యాపేటలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ జనజాతరను తలపించింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, రెపరెపలాడుతున్న జెండాలతో విజయవాడ-హైదరాబాద్ హైవే గులాబీ వనమైంది. సభ సాయంత్రం 5గంటలకు ఉండగా 12గంటల నుంచే జనం భారీగా వచ్చి చేరడంతో సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. కుల వృత్తుల వేషధారణలు, గిరిజన లంబాడీ మహిళల నృత్యాలు, గొల్లకుర్మల డిల్లెం బల్లెం.. ఇలా సబ్బండ వర్గాల ప్రజలు సమూహాలుగా నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 'ఇది ఎర్ర జెండా గడ్డ, కమ్యూనిస్టుల అడ్డ.. భీంరెడ్డి నర్సింహారెడ్డి లాంటి వ్యక్తులు పోరాడిన ఈ ప్రాంతంలో డబ్బుల కట్టల మదంతో కొట్టుకుంటున్న కాంగ్రెసోళ్ల అరాచకాలు సాగవు' అని కేసీఆర్ చెప్పినప్పుడు జనం కేరింతలు కొట్టారు. బహిరంగ సభకు ఊహించిన దానికంటే ఎక్కువ జనం రావడంతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

నేడు నల్లగొండలో కాంగ్రెస్ బహిరంగ సభ

- పాల్గొననున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



నల్లగొండలో సిద్ధమైన సభా వేదిక

నల్లగొండ: నల్లగొండ పట్టణ సమీపంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు(ఇందిరా ప్రాంగణం)లో బుధవారం కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారు. నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలు బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డుల నుంచి జన సమీకరణ చేస్తున్నారు. మల్లికార్జున ఖర్గేతో పాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బహిరంగ సభలో పాల్గొన్నారు.

27న ప్రియాంకగాంధీ పర్యటన
నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 27న జిల్లాలో ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ పర్యటించనున్నారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు మునుగోడులో, మధ్యాహ్నం 2 గంటలకు దేవరకొండ నిర్వహించనున్న బహిరంగ సభల్లో ఆమె పాల్గొని ప్రసంగించనున్నారు.

వృద్ధులు ఓటేసేలా చేయూతనివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ: వయో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతిఒక్కరూ వారికి చేయూతనందించాలని జెడ్పీ సీఈఓ, జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఎన్నికల విధులపై అంగన్‌వాడీ సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని, నిజాయితీగా ఓటు హక్కు వినియోగించేలా యువతను చైతన్య పరచాలన్నారు. ఎన్నికల క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ దివ్యాంగులకు సంబంధించిన సాక్ష్యం యాప్‌పై అవగాహన కల్పించాలని కోరారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ కృష్ణవేణి మాట్లాడుతూ అంధులైన ఓటర్లు బ్రెయిలీ లిపి ద్వారా ఎలా ఓటు వేయాలనే దానిపై సిబ్బందికి శిక్షణ నిచ్చారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



మిర్యాలగూడలో అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు అవినాష్ చంపావత్



దేవరకొండ : శిక్షణ సెంటర్‌లో రికార్డును పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు కన్నన్

- ఎన్నికల సాధారణ పరిశీలకులు అవినాష్ చంపావత్, కన్నన్

మిర్యాలగూడ, దేవరకొండ: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు అవినాష్ చంపావత్, ఆర్.కన్నన్ ఆదేశించారు. మంగళవారం మిర్యాలగూడలోని కేఎన్‌ఎం డిగ్రీ కళాశాలలో, దేవరకొండలోని ఎంకేఆర్ కళాశాలలో పీఓలు, ఏపీఓలకు వేర్వేరుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలను వారు పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను అధికారులు తప్పకుండా పాటించాలన్నారు. శిక్షణలో భాగంగా పోలింగ్ ప్రక్రియలో సిబ్బంది సిద్ధం చేయాల్సిన ఫారాలు, ఈవీఎంల నిర్వహణ, మాక్ పోలింగ్, ఓటింగ్ సరళితో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మిర్యాలగూడ, దేవరకొండ ఆర్‌ఓలు చెన్నయ్య, శ్రీరాములు, దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్, కోదాడలో నేడు కేటీఆర్ రోడ్ షోలు
చౌటుప్పల్, కోదాడ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చౌటుప్పల్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్‌షో ప్రారంభం కానుంది. చిన్నకొండూర్ చౌరస్తా వద్ద ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగిస్తారని మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే కోదాడలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించనున్నారు. కోదాడ నియోజకవర్గ సరిహద్దుగా ఉన్న మాధవరం నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ రోడ్ షో ప్రారంభం కానుంది. అక్కడి నుంచి కోదాడ బైపాస్, గుడిబండ రోడ్డు, ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి రంగా థియేటర్ వరకు పట్టణంలో ఈ రోడ్‌షో కొనసాగనుంది.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ: రైతులకు ఫర్టిలైజర్ దుకాణ యజమానులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని రైతు వేదికలో వ్యవసాయ సహాయ సంచాలకులు పి.నాగమణి అధ్యక్షతన నియోజవకర్గంలోని వివిధ మండలాల ఏఓలు, ఫర్టిలైజర్స్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లో ఉన్న డీలర్లు ఎరువుల విక్రయాలను ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే చేయాలని, ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రతిరోజూ ఎరువుల అమ్మకాలు, కొనుగోలు వివరాలను సంబంధిత ఏఓకు సమర్పించాలన్నారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఓలు కల్యాణ్‌చక్రవర్తి, సైదా, అర్చన, రుషేంద్రమణి, డీలర్లు రామ్మూర్తి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్



ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారుల (పీఓల)దేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. నల్లగొండలోని కేపీఎం జూనియర్ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు, పోలింగ్ రోజు ఎన్నికల సిబ్బంది చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ప్రతి విషయాన్ని తెలియజేసే హ్యాండ్ బుక్‌లు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. పీఓలు, ఏపీఓలు, పోలింగ్ సిబ్బంది ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటలకల్లా వారికి కేటాయించిన నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకొని రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ రిటర్నింగ్ అధికారి రవి, శిక్షణ నోడల్ అధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ పరమేశ్ పాల్గొన్నారు.

13.41లక్షల మందికి ఓటరు స్లిప్‌ల పంపిణీ
ప్రతి ఓటరు ఓటేసేలా పోలింగ్ బూత్ వివరాలతో రూపొందించిన ఓటరు సమాచారం స్లిప్‌లను ఇప్పటివరకు 91.64 శాతం పంపిణీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో 14,64,080 మంది ఓటర్లు ఉండగా మంగళవారం నాటికి 13,41,693 మంది ఓటర్లకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. నల్లగొండలో 2,44,460 ఓటర్లకుగాను 2,18,805 మందికి అందించామన్నారు. మునుగోడులో 2,52,648కు 2,23,864 మందికి, నకిరేకల్‌లో 2,50,547కు గాను 2,44,584 మందికి, మిర్యాలగూడలో 2,31,391కు 2,18,425 మందికి, నాగార్జునసాగర్‌లో 2,33,412కు 2,15,944 మందికి, దేవరకొండ నియోజకవర్గంలో 2,51,622 మందికి గాను 2,20,071 మంది ఓటర్లకు స్లిప్‌లు పంచామని తెలిపారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు
నల్లగొండ: ప్రజాస్వామ్యం మనకు కల్పించిన గొప్ప హక్కు ఓటుహక్కు అని, దాన్ని నోటుకు అమ్ముకుంటే మిమ్మల్ని మీరు అమ్ముకున్నట్లేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మంగళవారం జిల్లా యంత్రాంగం, జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎన్జీ కాలేజీ వద్ద ఎథికల్ ఓటింగ్‌పై చేపట్టిన ఓటరు అవగాహన ర్యాలీ, ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం గడియారం సెంటర్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈనెల 30న నిర్భయంగా ఓటెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కర్నాటి విజయ్ కుమార్, కొలనుపాక రవికుమార్, స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళింది, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం కోటేశ్వరరావు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, డీఈఓ భిక్షపతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్



హాజరైన విద్యార్థులు, అధికారులు



సూర్యాపేటలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో సీఎం కేసీఆర్, ఎంపీ లింగయ్యయాదవ్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక తదితరులు



కేసీఆర్‌కు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మంత్రి సతీమణి సునీత



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి



బందోబస్తును పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



సభా వేదిక నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

సీఎం సభలో అవీ..ఇవీ..

- సీఎం హెలికాప్టర్ సాయంత్రం 4.30 గంటలకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ప్రాంగణానికి చేరుకుంది.
- హెలికాప్టర్ సభ ప్రాంగణానికి చేరుకోగానే సభలో ఉన్న ప్రజానీకం అభివాదం చేశారు. ఈ సమయంలో హెలికాప్టర్ సభ ప్రాంగణం చుట్టూ ఒక సారి చక్కర్ కొట్టడంతో ప్రజానీకం 'కేసీఆర్.. కేసీఆర్.. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్' అని కేరింతలు కొట్టారు.
- 4.40 గంటలకు సభా వేదికపైకి ముఖ్యమంత్రి కేసీఆర్ చేరుకుని 4.50 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. దాదాపు 20 నిమిషాలు ప్రసంగించారు.
- 5.20 గంటలకు కేసీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరివెళ్లారు.
- ప్రధాన వేదికకు పక్కనే ఏర్పాటు చేసిన వేదిక నుంచి కళకారులు తమ ఆటాపాటలతో సభికులను హోరెత్తించారు. 'గులాబీ జెండలే రామక్క.. గుర్తుల గుర్తుంచుకో రామక్క' పాటలతో జనమంతా ఉత్సాహంతో ఊగిపోయారు.

• గుర్తుకొస్తున్నాయి..



1999 ఎన్నికల్లో సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి దోసపాటి గోపాల్‌ను గెలిపించాలని ప్రచారానికి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి



2004లో సూర్యాపేటలో కాంగ్రెస్ అభ్యర్థి వేదాసు వెంకయ్యను గెలిపించాలని ప్రచారానికి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు

– సేకరణ : అనమాల యాకయ్య, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

పాటకి ప్రాణం పోస్తున్నాడు..

జంగ్ తెలంగాణ

- ఎన్నికల ప్రచారంలో మార్మోగుతున్న 'నల్లగొండ గద్దర్' స్వరం
- అన్ని పార్టీల ప్రచారానికి కైకట్టి పాడుతున్న నర్సిరెడ్డి
- వందల సంఖ్యలో పాటల రికార్డు
- అధికార, ప్రతిపక్షాలకూ సందర్భానికి తగ్గట్టు పాటలు



'నల్లగొండ గద్దర్' నర్సిరెడ్డి

సాక్షి, హైదరాబాద్ : నల్లగొండ నర్సిరెడ్డి అంటే చాలామందికి తెలియకపోవచ్చు కానీ నల్లగొండ గద్దర్ అంటే బహుశా తెలియనివారు ఉండరు. తెలంగాణ సాంస్కృతిక జీవితాన్ని, రాజకీయ పార్టీల తీరుతెన్నులను అభివర్ణిస్తూ ఆయన అప్పటికప్పుడు పాటలను కైకట్టి పాడుతాడు. అందుకే ఎన్నికల వేళ.. నల్లగొండ గద్దర్ పాట తెలంగాణ అంతటా హోరెత్తుతోంది. అన్ని పార్టీల వేదికలపైనా, ప్రచార రథాలపైనా మార్మోగుతోంది. ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై అపారమైన అభిమానంతో, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రకరకాల బాణీల్లో పాటలు పాడి ఆకట్టుకున్న నల్లగొండ గద్దర్ ప్రస్తుత ఎన్నికల కోసం వందల సంఖ్యలో పాటలు పాడారు. ఎన్నికల వేళ.. ఆయన 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు.

గద్దరన్నే నా గురువు

పాటతో నాది దాదాపు 30 ఏళ్ల ప్రయాణం. 1995 నుంచి 2009 వరకు ఎన్నో పాటలు పాడాను. ఆ తర్వాత పాటల రికార్డింగ్ ప్రారంభించాను. చిన్నప్పటి నుంచే ప్రజాగాయకుడు గద్దర్‌కు వీరాభిమానిని, ఇప్పటికీ నా గురువుగా గద్దరన్నే. నా స్వరం గద్దరన్న గొంతుకు దగ్గరగా ఉండటం వల్ల, నేను ఏర్పర్చుకున్న విప్లవ పంథా, గద్దర్ భావజాలంతో సామాజిక అంశాలపైన పాటలు పాడటం వల్ల నన్ను కూడా 'నల్లగొండ గద్దర్'గా పిలిచేవారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం గుండ్రవల్లి గ్రామానికి చెందిన అతి సామాన్యమైన పేద రైతు కుటుంబం మాది. మొదటి నుంచీ ఎన్నికల నేపథ్యంలో పాటలు పాడుతున్నా. కేసీఆర్, కేటీఆర్, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, కల్వకుంట్ల కవిత, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఇలా అన్ని పార్టీల రాజకీయ నాయకులకు వ్యక్తిగత పాటలు పాడాను. కర్ణాటకలో సిద్దరామయ్య, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ కోసం కూడా పాటలు పాడాను.

రెండు గంటల్లో పాట...

అన్ని పార్టీల నాయకులతో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి ఒక పార్టీకి, ఒక వర్గానికి చెందిన వ్యక్తిగా ముద్ర పడకుండా జాగ్రత్త పడ్డాను. ఒక పాట పాడేందుకు 2 గంటలపాటు కష్టపడుతాను. కేసీఆర్ కోసం 'గలగల పారేటి గంగమ్మ..' అనే పాట, రాహుల్‌గాంధీ కోసం 'మూడు రంగుల జెండా' వంటి పాటలకు గొప్ప ప్రశంసలు లభించాయి. సాంస్కృతిక, సామాజిక, విప్లవ పాటలతో పాటు పలు సినిమాల్లో కూడా పాటలు పాడే అవకాశం లభించింది. నా పేరుతో ప్రత్యేకంగా ఒక యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాను. దీనికి 3.75 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

జైలులో ఉన్నా ఓటు వేయొచ్చు

భువనగిరి: భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారత పౌరులందరికీ ఓటు హక్కు ఉంటుంది. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంట్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటేసే అవకాశం కల్పించాలని రాతపూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్లను తెప్పించి జైలు నుంచే ఓటేసే అవకాశం కల్పిస్తారు.

పోలింగ్ బూత్‌లో ప్రత్యేక నిబంధనలు

- పోలింగ్ రోజున ఓటరు గోప్యత పాటించకుండా తాను ఎవరికి ఓటు వేసే విషయాన్ని బహిర్గతం చేస్తే ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లుగా అధికారులు భావించి సదరు వ్యక్తిని ఓటు వేయడానికి అనుమతించరు.
- అంధులు ఓటు వేసేందుకు వీలుగా అతడికి సహాయకుడిగా 18 ఏళ్లు నిండిన వ్యక్తిని అధికారులు పోలింగ్ కేంద్రానికి అనుమతిస్తారు. సహాయకుడిగా వచ్చే వ్యక్తి ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొస్తేనే అనుమతిస్తారు.
- ఓటరు ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వచ్చినప్పుడు అప్పటికే అతడి ఓటు ఎవరైనా వేస్తే పోలింగ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అప్పుడు అది టెండర్ ఓటుగా పరిగణించి పోలింగ్ అధికారుల వద్ద ఉండే ప్రత్యేక బ్యాలెట్ పేపర్ ద్వారా పాత పద్ధతిలో ఓటు వేయవచ్చు.
- ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు అది బోగస్ ఓటు అని, తక్కువ వయస్సు అని పోలింగ్ ఏజెంట్లు చాలెంజ్ చేస్తే పోలింగ్ అధికారి ఏజెంట్ నుంచి విషయాలను సేకరిస్తారు. ప్రాథమిక విచారణ జరిపి ఆరోపణ నిజమైతే సదరు ఓటరును పోలీస్ సిబ్బందికి అప్పగిస్తారు.
- ఒక ఓటరు తాను నచ్చిన పార్టీకి ఓటు వేస్తే.. అది వేరే పార్టీకి పడ్డట్లు ఆరోపణలు చేస్తే అధికారులు టెస్టు ఓటును అనుమతిస్తారు. అయితే ఆ ఆరోపణలు రుజువు కాకుంటే చర్యలు తీసుకుంటామని కూడా సదరు ఓటరుకు ముందే హెచ్చరిస్తారు.

– తిరుమలగిరి (తుంగతుర్తి)

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు



పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

నకిరేకల్ : నకిరేకల్ ఆర్‌ఓ కార్యాలయం నుంచి మంగళవారం పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద ఓటు వేసే అంగవైకల్యం, వృద్ధుల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం.. బాక్స్‌లను సిద్ధం చేసి ఆయా కేంద్రాలకు పంపించారు. నకిరేకల్ నియోజకవర్గంలో సీనియర్ సిటిజన్, అంగవైకల్యలం గలవారు మొత్తం 190 మంది, ఎన్నికల డ్యూటీ ఉన్నవారు 2000 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే సీనియర్ సిటిజన్స్, అంగవైకల్యం గల వారికి ఆయా మండలాల్లో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయించే పనిలో ఉన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది నియోజకవర్గ కేంద్రాల ట్రైనింగ్ సెంటర్‌లో తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రం తెలుసుకోండిలా..



తిరుమలగిరి (తుంగతుర్తి): ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఇబ్బంది లేకుండా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటర్లు తమ సెల్‌ఫోన్‌లో సీఈవో.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో ఎలక్టోరల్ రోల్స్ అనే కాలమ్‌ను ఎంచుకోవాలి. అందులో జిల్లా, అసెంబ్లీ, నియోజకవర్గం ఎంపిక చేసుకుంటే అన్ని పోలింగ్ కేంద్రాల వివరాలు కనిపిస్తాయి. ఓటర్లు తమ గ్రామం, కాలనీ పోలింగ్ కేంద్రంపై క్లిక్ చేస్తే గూగుల్ మ్యాప్, పోలింగ్ కేంద్రం ఫొటోలు ప్రత్యక్షమవుతాయి. అలాగే ఓటరు ప్రారంభ సంఖ్య, చివరి సంఖ్య, పురుషులు, మహిళలు ఎంతమంది ఉన్నారో కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే కీలకం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాగిరెడ్డి

భువనగిరిటౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమని భువనగిరి మున్సిపల్ కమిషనర్, స్వీప్ ప్రచార కార్యక్రమాల నోడల్ అధికారి బి.నాగిరెడ్డి పేర్కొన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. స్వీప్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం భువనగిరిలోని ఓటరు చైతన్యం, అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ రమణి, జిల్లా యువజన, క్రీడల అధికారి ధనుంజయ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల సిత్రాలు

• కారు గుర్తుకు ఓటెయ్యాలె ఉయ్యాలో..



తుర్కపల్లి మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

• ఓటుతో 'గీత' మారుస్తాం



మోటకొండూర్ మండలంలో ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య ఎన్నికల ప్రచారంలో మోకు, ముస్తాదుతో డ్యాన్స్ చేస్తున్న గౌడ కులస్తులు

• 'దివ్యమైన' ప్రచారం



బైక్‌ని ప్రత్యేకంగా అలంకరించుకుని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రచారం చేస్తున్న టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ వీరయ్య

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

రామన్నపేట: గేదెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన చిత్రగోని మల్లయ్య(55) మంగళవారం మధ్యాహ్నం గ్రామంలోని చెరువు సమీపంలో గేదెలను మేపడానికి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఊరు మొత్తం గాలించగా.. చెరువు సమీపంలో మల్లయ్య చెప్పులు, చేతి కర్ర ఉన్నాయి. రాత్రయినా మల్లయ్య ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా చెరువు అవతలి పక్కన మల్లయ్య కుమార్తెం పొలం ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ



విలపిస్తున్న బాధితురాలు

నేరేడుచర్ల: వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి 4 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి నేరేడుచర్ల పట్టణంలోని జనిగబాయి రోడ్డులో జరిగింది. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జనిగబాయి రోడ్డులో నివాసముంటున్న రాయి సైదమ్మ మరో వృద్ధురాలితో కలిసి తన ఇంటి ముందు ఉన్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కొంత దూరంలో ఆపి వారి వద్దకు వచ్చాడు. వంద రూపాయల నోటు కింద పడిందని, ఆ నోటు ఇవ్వమని అనడంతో సైదమ్మ నేలపై పడిన నోటును తీస్తుండగా ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. సైదమ్మ లబోదిబోమంటూ కన్నీటి పర్యంతమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి 6నెలల జైలుశిక్ష, జరిమానా

భూదాన్‌పోచంపల్లి: బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ఎదురుగా వస్తున్న వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి 6నెలల జైలు శిక్షతో పాటు రూ.8వేలు జరిమానా విధిస్తూ చౌటుప్పల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలం ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన దేవర అంజనేయులు పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అంజనేయులు 2014 అక్టోబర్ 23న తన బైక్‌పై వేగంగా వెళ్తూ ఇబ్రహీంనగర్ గ్రామ శివారులో ఎదురుగా బైక్‌పై వస్తున్న రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన గుంజె కృష్ణ, అతడి భార్య లక్ష్మిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తలకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఆర్. జగన్మోహన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ కేసు మంగళవారం విచారణకు రాగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పీవీ అవినాష్ తమ వాదనలు వినిపించారు. వాదనలు విన్న చౌటుప్పల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి. మహతి వైష్ణవి విచారణ జరిపి నేరం రుజువైనందున నిందితుడు అంజనేయులుకు 6నెలల జైలు శిక్ష, రూ.8వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడేలా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ ముత్తయ్య, సమన్స్ అందించిన శివకుమార్‌ను ఎస్ఐ విక్రమ్‌రెడ్డి అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టి యువకుడు దుర్మరణం



గోపి (ఫైల్)

మిర్యాలగూడ: స్కూటీపై వెళ్తున్న యువకుడు రహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా.. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన పాశం గోపి(28) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలో గల జానపహాడ్ గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. వైద్యానికి సంబంధించిన మందులు కొనుగోలు చేసేందుకు మంగళవారం స్కూటీపై మిర్యాలగూడకు వచ్చిన అతడు తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చేరుకోగానే అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యులు నుంచి ఫిర్యాదు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. గోపికి త్రిపురారం మండలం నీలాయగూడెం గ్రామానికి చెందిన మహిళతో ఇటీవల ప్రేమ వివాహమైంది.

ఉత్తమ బస్టాండ్‌గా కొండమల్లేపల్లి



దేవరకొండ డీఎంను సన్మానిస్తున్న ఆర్టీసీ ఈడీ

కొండమల్లేపల్లి: పరిశుభ్రత, ఆధునీకరణ అంశాల్లో నల్లగొండ రీజియన్ పరిధిలోని కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం నల్లగొండలో నిర్వహించిన ప్రగతి చక్రాల త్రైమాసిక పురస్కారాల పంపిణీలో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం చేతుల మీదుగా దేవరకొండ డిపో మేనేజర్ ప్రేమ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎంను సన్మానించారు.